

12వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పువ్వాడ వసంతలక్ష్మి

## 12 డివిజన్‌లో మంత్రి సతీమణి ప్రచారం

ఖమ్మం, అక్టోబర్ 17: బీఆర్‌ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి అయిన తన భర్త పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి పువ్వాడ వసంతలక్ష్మి మంగళవారం ఖమ్మం 12వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి తన భర్త చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ప్రతి ఒక్కరికీ కరపత్రాలు అందజేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఖమ్మంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని వివరించారు. మరింత అభివృద్ధి కోసం తన భర్తను మరోసారి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకురాళ్లు కొల్లు పద్మ, షకీనా తదితరులు పాల్గొన్నారు.

## ట్రక్కు బోల్తా పడి వలస కూలీల దుర్మరణం

రఘునాథపాలెం, అక్టోబర్ 17: రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వలస కూలీలు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఖమ్మం బల్లేపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఖానాపురం హవేలీ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ కర్మహా గ్రామానికి చెందిన సోదరులు హీరాలాల్ (28), జవహర్‌లాల్ (30) ఆరేళ్ల క్రితం ఖమ్మం వచ్చి గ్లాస్ ఫిటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా, పనుల నిమిత్తం మణుగూరు వెళ్లిన వీరు.. సోమవారం రాత్రి తిరిగి లేల్యాండ్ ట్రక్కులో ఖమ్మం బయల్దేరారు. మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం శివారు బల్లేపల్లి వద్దకు చేరుకోగానే వాహనం ప్రమాదవశాత్తూ బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రక్కులో ఉన్న అన్నదమ్ములైన హీరాలాల్, జవహర్‌లాల్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. హవేలీ ఎస్సై వెంకన్న ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. అన్నం సేవా ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది సహాయంతో మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## బైకును ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 17: మండలంలోని దమ్మాయిగూడెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం పూర్యాతండకు చెందిన గుగులోత్ వీరూ, భూక్యా శ్రీను కలిసి తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం వద్ద పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. మంగళవారం ఇద్దరూ తమ గ్రామం నుంచి బైక్‌పై పొలం వద్దకు బయలుదేరారు. దమ్మాయిగూడెం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ఖమ్మం నుంచి మరిపెడ బంగ్లా వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి అతివేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో బైక్ నడుపుతున్న గుగులోత్ వీరూ కాలు విరిగింది. నడుముకు తీవ్ర గాయమైంది. బైక్ వెనుక కూర్చున్న భూక్యా శ్రీను లారీ టైరుకింద పడడంతో అతడి రెండు కాళ్లూ నుజ్జునుజ్జయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## క్లౌడ్ కంప్యూటింగ్‌పై ఎస్‌బీఐటీలో శిక్షణ

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 17: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత టెక్నాలజీలో క్లౌడ్ కంప్యూటింగ్‌కు ఎక్కువ డిమాండ్ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ జీ.ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ట్రైనర్లు హేమంత్‌కృష్ణ పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాల వద్ద అన్నదానాలు

కూసుమంచి రూరల్, అక్టోబర్ 17: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి మండపాల వద్ద మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పెరికసింగారం, నర్సింహులగూడెం, ఈశ్వరమాదారం గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, ఎంపీటీసీ మోదుగు వీరభద్రం ప్రారంభించారు. వెంకటేశ్వర్లు, సుధీర్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ఖమ్మం సిటీ, అక్టోబర్ 17: ఖమ్మానికి చెందిన దివంగత పల్లా జాన్‌రాములు 85వ జయంతి మిషన్ ఆసుపత్రిలో ఐదు రోజులుగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైందని పల్లా కిరణ్‌కుమార్ తెలిపారు. చివరి రోజైన మంగళవారం దాదాపు 700 మందికి, మొత్తం ఐదు రోజుల్లో కలిపి 2,500 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపించి మందులు పంపిణీ చేశామని తెలిపారు.

## ‘అన్నపూర్ణా దేవి’ అవతారంలో దుర్గమ్మతల్లి

రఘునాథపాలెం, అక్టోబర్ 17: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన దుర్గమ్మతల్లి మంగళవారం శ్రీఅన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాండురంగాపురం శ్రీరామలింగేశ్వర ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎల్‌బీ నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ తల్లి మండపంలో బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సురేశ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

# ఖమ్మం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశా

- నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది మీ కళ్ల ముందు ఉంచా..
- మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా..
- ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి అజయ్
- సమస్య సీఎం దృష్టికెళ్తే అది పరిష్కారమైనట్లే: వద్దిరాజు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 17: ఖమ్మం అభివృద్ధి కోసం ఎంతో చిత్తశుద్ధితో పనిచేశానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఖమ్మం ప్రజల కళ్ల ముందు ఉంచానని అన్నారు. మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఈ 75 ఏళ్లలో ఖమ్మానికి మంత్రి పదవిని ఏ పార్టీ ఇవ్వలేదని గుర్తుచేశారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం తన ద్వారా ఆ అవకాశం కల్పించారని వివరించారు. దీనిని సద్వినియోగం చేసుకొని ఖమ్మాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానని అన్నారు. ఖమ్మం 46వ డివిజన్ జహీర్‌పురలోని వేములపల్లి వెంకటేశ్వరరావు నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం అభివృద్ధి చెందింది కాబట్టే అనేక పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు ఇక్కడికి వచ్చి అనేక మాల్స్ ఏర్పాటు చేశాయని వివరించారు. వేములపల్లి బాబు తన తండ్రి పువ్వాడ నాగేశ్వరరావుకు, వేములపల్లి వెంకన్న తనకు అత్యంత సన్నిహితులని అన్నారు. గడచిన పదేళ్లుగా ఖమ్మం ప్రజలతో మమేకమయ్యానని, వర్తక, వాణిజ్య సంఘాల వారి పట్ల నిబద్ధతతో పనిచేశానని గుర్తుచేశారు. మార్కెట్‌ను ఇక్కడి నుంచి తరలిస్తున్నామంటూ తొలినాళ్లలో కొందరు తనపై అనేక ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. కానీ తాను ఉన్నంత వరకు మార్కెట్ ఇక్కడి నుంచి తరలించడం జరగదని స్పష్టం చేశారు.

**సమస్య సీఎం దృష్టికెళ్తే అది పరిష్కారమైనట్లే: వద్దిరాజు**

ఎన్నికల ప్రచారంలో అజయ్ అన్న పానీయాలన్నీ బయటే జరుగుతున్నాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇంతే నిబద్ధతో పనిచేసి ఖమ్మాన్ని ఆయన అభివృద్ధి చేశారని అన్నారు. వ్యాపారమైనా, క్రమశిక్షణైనా, దైవభక్తైనా, మరేదైనా వైశ్యుల వద్దే నేర్చుకోవాలని అన్నారు. కేసీఆర్‌కు, అజయ్‌కు హ్యాట్రిక్ అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. ఏ సమస్య అయినా సీఎం కేసీఆర్ దృష్టికి వెళ్లనంత వరకే అది సమస్యగా ఉంటుందని, ఒక్కసారి సమస్య సీఎం కేసీఆర్ దృష్టికెళ్తే అది పరిష్కారమైనట్లేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల బాధ్యులు ఆర్‌జేసీ కృష్ణ, చెరుకూరి కృష్ణమూర్తి, కన్నం వైష్ణవీ ప్రసన్నకృష్ణ, పసుమర్తి రామ్మోహన్, చిన్ని కృష్ణారావు, గుర్రం ఉమా మహేశ్వరరావు, బొమ్మ రాజేశ్వరరావు, రాయపూడి వెంకటరామారావు, పెనుగొండ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

**హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను గెలిపించాలి**

హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్‌ను గెలిపించాలని మంత్రి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కేసీఆర్ సహకారంతోనే ఖమ్మాన్ని తీర్చిదిద్దానని అన్నారు. దానిని గమనించి ఖమ్మం ప్రజలు ఈ ఎన్నికల్లో తనకు మరోసారి అధిక మెజార్టీ అందించాలని కోరారు. ఖమ్మం 54వ డివిజన్ తిరుపతి స్టీల్ అధినేత రావులపాటి నరేశ్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు బచ్చు విజయ్‌కుమార్, చేకూరి సత్యంబాబు, ఎలినేని రమణ, రాపర్తి శరత్, ఎన్.సురేందర్ రెడ్డి, పోట్ల శ్రీకాంత్, బత్తుల మురళి, పిల్లి శేఖర్, కిలారు బాబ్జీ, సంపత్, ప్రభు, నరేందర్ పాల్గొన్నారు.

**ప్రజలు, కార్యకర్తలే నా బలం..**

ఖమ్మం నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలే తన బలం, బలగమని మంత్రి అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మం 24వ డివిజన్‌లో మంగళవారం జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరెన్ని నీచ రాజకీయాలు చేసినా చివరికి గెలిచేది బాహుబలి లాంటి తానేనని స్పష్టం చేశారు. ఖమ్మాన్ని ఎవరు ఎంతలా అభివృద్ధి చేశారో ఇక్కడి ప్రజలకు తెలుసునని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు షేక్ అబ్దుల్ రెహమాన్, గోలి రామారావు, పిల్లి విజయ్‌పాల్, పగడాల నాగరాజు, పునుకొల్లు నీరజ, బచ్చు విజయ్‌కుమార్, పారా ఉదయ్‌కుమార్, అమరాగాని వెంకటేశ్వర్లు, కర్నాటి కృష్ణ, మక్బూల్, పల్లా రోజ్‌లీనా, మందడపు మనోహర్, షకీనా, సూరపనేని శేషగిరిబాబు, పేశెట్టి మనోహర్, తాజుద్దీన్, అనిల్, అస్లాం, కడారి వెంకన్న, చందు, శ్రీగాద శీను, రేగళ్ల నాగరాజు, రామలక్ష్మి, నాగలక్ష్మి, కవిత, అమీర్ పాషా పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన ఎన్నికల ఏర్పాట్లు చేయాలి

**ఆర్వో, ఏఆర్వోల సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్**



మామిళ్లగూడెం, అక్టోబర్ 17: శాసనసభ ఎన్నికల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్, ఈవీఎం కమిషనింగ్ కేంద్రాల సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత ఈవీఎంలు నియోజకవర్గాలకు పంపిస్తామని, వాటిని భద్రపర్చడానికి అన్ని భద్రతా చర్యలు పాటిస్తూ స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల విత్‌డ్రాయల్ ప్రక్రియ పూర్తవగానే, ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి నియోజకవర్గ స్థాయిలో చేపట్టాలన్నారు. శిక్షణ కేంద్రాలను గుర్తించి అన్ని ఏర్పాట్లూ చేయాలని ఆదేశించారు.

## ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సిటీ, అక్టోబర్ 17: ఖమ్మంలో ప్రభుత్వ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) ట్రైనింగ్ స్కూల్లో 2023-24 విద్యా సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 20లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ.మాలతి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) పూర్తి చేసిన వారు, తత్సమాన కోర్సులు చదివిన విద్యార్థులు అర్హులని చెప్పారు. అభ్యర్థులు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వారై ఉండాలన్నారు.

## కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేయాలి

**రఘునాథపాలెం కేంద్రం పరిశీలనలో అదనపు కలెక్టర్**



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

రఘునాథపాలెం, అక్టోబర్ 17: ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం రఘునాథపాలెం జింకలతండా రోడ్డులో గల తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములను ఖమ్మం జిల్లాలోని ఐదు శాసనసభ నియోజకవర్గాల అభ్యర్థులకు పోలైన ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ కేంద్రంగా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేంద్రంలో డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో కేంద్రంలోని ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. గోదాముల్లో కౌంటింగ్‌తోపాటు మీడియా గ్యాలరీ వంటి ప్రత్యేక సదుపాయాలను కల్పించాలని సూచించారు. అందుకు ప్రత్యేక మ్యాప్‌తో కూడిన ప్లాన్‌ను సిద్ధం చేసి ఉంచాలన్నారు. కౌంటింగ్ రోజున విధులకు వచ్చే అధికారులు, సిబ్బంది, ఇతర పొలిటికల్ పార్టీల నేతల వాహనాలను పార్కింగ్ చేసేందుకు అందుబాటులో ఉన్న అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సిద్ధం చేయాలని తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను ఆదేశించారు. ఆర్ అండ్‌బీ సీఈ శ్యాంప్రసాద్, గిర్దావర్ సత్యనారాయణ, గోదాము ఇన్‌చార్జి రమేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు

మామిళ్లగూడెం, అక్టోబర్ 17: నూతన కలెక్టరేట్‌లో ప్రాంగణంలో ఉద్యోగులు, అధికారులు మంగళవారం వినూత్నంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఈ శాసనసభ ఎన్నికలు ఉన్న సందర్భంగా బతుకమ్మ సంబురాల్లో స్వీప్ కార్యక్రమం ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగంపై నినాదాలు, ప్లే కార్డులను బతుకమ్మల వద్ద ప్రదర్శించారు. ఓటుకు సంబంధించి పాటలు పాడుతూ కలెక్టరేట్ మహిళా అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీలు బతుకమ్మ ఆడారు. వేడుకల్లో కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు సత్యప్రసాద్, మధుసూదన్‌నాయక్, ఆదర్శ్ సురభి, మయాంక్‌సింగ్, గణేశ్, అశోక్‌చక్రవర్తి, రాజేశ్వరి, సుమ, విద్యాచందన పాల్గొన్నారు.





ఐడీవోసీలో బతుకమ్మలను ఆడుతున్న జిల్లా అధికారులు